ప్రజాశక్తి

బుధవారం 16 జూలై 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





విలేజ్ టు వెస్సెల్ టూరిజం

◆ పోర్టుల్లో వినూత్న ఆలోచనలకు బిమ్స్ టెక్ శ్రీకారం

◆ సాగరమాలతో పోర్టు బెర్తుల ఆధునికీకరణ, తీర ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి

◆ ఇండియన్ మారిటైం యూనివర్సిటీ ప్రతినిధి కెప్టెన్ యోగేష్ షా



మాట్లాడుతున్న యోగేష్ షా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలోని పోర్టుల్లో క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి అత్యంత ప్రధానమైన 'విలేజ్ టు వెస్సెల్' టూరిజం కాన్సెప్ట్‌తో స్థానిక ప్రజలు, చేతివృత్తిదారులు, యువతను భాగస్వామ్యం చేస్తే వారికి ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని ఇండియన్ మారిటైం యూనివర్సిటీ ప్రతినిధి కెప్టెన్ యోగేష్ షా వెల్లడించారు. విశాఖలో జరుగుతున్న బిమ్స్‌టెక్ - 2025 కాన్క్లేవ్‌లో రెండో రోజైన మంగళవారం ఆయన కీలకోపన్యాసం చేశారు. బే ఆఫ్ బెంగాల్ మిగతా 2లో..

ముగిసిన కాన్క్లేవ్



హెచ్ఎస్ఎల్ సందర్శనలో మంత్రి సోనోవాల్

ఎంవిపి.కాలనీ : నోవోటెల్ వేదికగా రెండు రోజులపాటు జరిగిన బిమ్స్‌టెక్ పోర్ట్సు కాన్క్లేవ్ మంగళవారంతో ముగిసింది. రెండో రోజు కార్యక్రమంలో పాల్గొన్న పలు దేశాల ప్రతినిధులు బంగాళాఖాతం తీర ప్రాంతంలోని ప్రాంతీయ నౌకాశ్రయ సహకారం, పోర్టుల సామర్థ్యం, క్రూయిజ్ పర్యటనల అభివద్ధి, మానవ వనరుల ప్రగతిపై చర్చించారు. బిమ్స్‌టెక్ మారిటైమ్ వర్క్‌ఫోర్స్‌ను అప్‌స్కిల్లింగ్ చేయడం అనే అంశంపై హెచ్ఎస్ఎల్ సిఎమ్‌డి హేమంత్ ఖత్రి మాట్లాడారు. నౌకా నిర్మాణ వ్యవస్థను దేశవ్యాప్తంగా విస్తరించడానికి సహకార శిక్షణ, జ్ఞాన భాగస్వామ్యం కోసం పిపిపి విధానం అవసరమన్నారు.

హెచ్ఎస్ఎల్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి సోనోవాల్

కేంద్ర పోర్టులు, నౌకలు, జలరవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ మంగళవారం విశాఖలోని హిందుస్తాన్ షిప్‌యార్డు (హెచ్ఎస్ఎల్)ను సందర్శించారు. షిప్‌యార్డులో నడుస్తున్న పనులు, వర్క్ ఆర్డర్ల గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) పనులపైనా మంత్రి సోనోవాల్ ఆరా తీశారు. ఆయన వెంట విశాఖపట్నం పోర్టు అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఉన్నారు.



వినూత్నరీతిలో నిరసన తెలుపుతూ మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

స్మార్ట్ మీటర్లతో విపరీత భారాలు

◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

◆ విశాఖలో దీపం బుడ్లు, లాంతర్లతో వినూత్న నిరసన

వార్త మెయిన్‌లో..

నేడు జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుని పర్యటన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం సాయంత్రం 7.30 గంటలకు రాజమహేంద్రవరం నుంచి రోడ్డు ద్వారా నగరానికి చేరుకుంటారు. రాత్రి స్థానిక హెచ్‌పిసిఎల్ అతిథిగృహంలో బస చేస్తారు. గురువారం ఉదయం 11 గంటలకు మింది బిహెచ్ఇఎల్ ప్లాంట్‌ను సందర్శించి సీనియర్ అధికారులతో సమావేశమవుతారు. ఆ రోజు సాయంత్రం అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై సమావేశం నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హెచ్ పిసిఎల్ రిఫైనరీ ప్లాంట్ సందర్శించనున్నారు.

పాఠశాలల స్థితిగతులపై నివేదిక ఇవ్వాలి

▶ వార్త 4లో..

పెన్షన్ వ్యాలిడేషన్ సవరణను రద్దు చేయాలి

▶ వార్త 2లో..

ఉత్తుత్తి శిక్షణతో నిధులు హాంఫట్

▶ వార్త 6లో..



నిరసన తెలుపుతున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

విశాఖ ఉక్కును కాదని జిందాల్‌కు గనులు కట్టబెడతారా ?

స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకుల నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వ రంగంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు ఇవ్వకుండా నిర్మాణమేకాని ప్రైవేటు ప్లాంట్లకు ఐరన్ ఓర్ కేటాయించడం దారుణమని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు అన్నారు. నెల్లూరు జిల్లాలో నెలకొల్పబోయే జిందాల్ స్టీల్ ప్లాంట్ కోసం అక్కడ లింగసముద్రం పరిసర ప్రాంతాల్లో ఇనుప గనులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని ఖండిస్తూ వారు విశాఖ నగరంలో మంగళవారం మిగతా 2లో..

వైద్యారోగ్య రంగ బలోపేతానికి చర్యలు

మంత్రి సత్యకుమార్

మానసిక వైద్యశాలలో ఆధునిక భవనాలు, పెదవాల్తేరులో యుపిహెచ్‌సి ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో వైద్యారోగ్య రంగ బలోపేతానికి వినూత్న రీతిలో చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. నిమ్స్ స్థాయికి.. విమ్స్‌ను తీసుకెళ్తామని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. దీర్ఘకాలిక లక్ష్యాలు, అవసరాల దష్ట్యా వచ్చే ఏడాది నుంచి సైకియాట్రీ విభాగంలో ఎమ్మెస్సీ లేదా డిప్లొమో, క్రినికల్ సైకాలజీలో 30 సీట్లతో కూడిన ఎం ఫిల్ కోర్సులు ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య అవసరాలు తీరుస్తున్న విశాఖపట్నంలోని మెంటల్ ఆసుపత్రి పేరు మార్పుపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. మెంటల్ కేర్ ఆసుపత్రి ప్రాంగణంలో రూ.29.70 కోట్లతో నిర్మించిన భవనాలను, పోలమాంబ గుడి సమీపంలో భానోజీనగర్‌లో రూ.1.38 కోట్లతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (యుపిహెచ్‌సి)ను మంగళవారం ఆయన లాంఛనంగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా పరిమితి సంఖ్యలో మానసిక వైద్యులు అందుబాటులో ఉన్నారని, ఈ పరిస్థితి మారాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ, విప్ వేపాడ చిరంజీవిరావు, ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు.



భవన నిర్మాణాల ప్రారంభోత్సవంలో మంత్రి సత్యకుమార్

మధురవాడ : రాష్ట్ర ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందించి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడంలో ప్రయివేటు ఆసుపత్రుల సహకారం కూడా అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. గీతం ఆసుపత్రిలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటుచేసిన మిగతా 2లో..

పెన్షన్ వ్యాలిడేషన్ సవరణను రద్దు చేయాలి

మొదటి పేజీ తరువాయి..

వైద్యారోగ్య రంగ బలోపేతానికి చర్యలు

40 పడకల ఎమర్జెన్సీ విభాగాన్ని, ఆపరేషన్ థియేటర్ల సమూహాన్ని మంగళవారం విశాఖ ఎంపీ, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సమక్షంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలను అందించడానికి మానవతా దృక్పథంతో గీతం ఆసుపత్రి విభాగాలను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. ఎంపీ ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా గీతం ఆసుపత్రి ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. జిమ్సర్ ఆసుపత్రి ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ గీతంలో కొత్తగా అత్యవసర విభాగాన్ని ఏడు ఐసియు పడకలతో, ఆపరేషన్ థియేటర్‌తో ఇంటెన్సివ్ కేర్ యూనిట్, రేడియాలజి, పెయిన్ క్లినిక్‌తో తీర్చిదిద్దినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ఎమ్.గంగాధరరావు, గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్‌డిసౌజా, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాదని జిందాల్‌కు గనులు కట్టబెడతారా ?

నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు సొంత గనులు కావాలని మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వానికి పట్టలేదన్నారు. సిఎం చంద్రబాబు ఆ విషయంపై స్పందించడం లేదన్నారు. అనకాపల్లిలో కట్టని ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం ముడి సరుకు ఇవ్వాలని సాక్షాత్తు ప్రధానమంత్రిని ఆయన అడుగుతున్నారని తెలిపారు. నెల్లూరు జిల్లాలో రాబోయే జిందాల్ స్టీల్ ప్లాంట్ కోసం అక్కడ లింగసముద్రం, ఆర్ఆర్ పాలెం, తిమ్మారెడ్డి పాలెం, పారేటివారిపాలెం ప్రాంతాల్లో ఉన్నటువంటి గనులను ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు పావులు కదుపుతున్నారన్నారు. రాష్ట్రంలో 40 సంవత్సరాలుగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు లేవన్నారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.54 వేల కోట్లు పన్నులు చెల్లించిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని గనులను విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు కేటాయించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విలేజ్ టు వెస్సెల్ టూరిజం

తీర ప్రాంతంలో క్రూయిజ్ టెర్మినల్స్‌ను ఏర్పాటు చేయడం ద్వారా నగరాలకే క్రూయిజ్ టూరిజం పరిమితం కాకుండా గ్రామాలకూ చేరుతుందన్నారు. గ్రామీణులు క్రూయిజ్ వెసెల్ (షిప్)నకు వచ్చేలా పర్యాటక టూరిజాన్ని ప్రోత్సహించాలన్నారు. దీనిపై దేశంలో పోర్టులు దృష్టిసారించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయాలపై కార్యాచరణ తీసుకోబోతోందని తెలిపారు. స్థానికులకు శిక్షణ ఇచ్చి సర్టిఫైడ్ గైడ్‌లుగా తీర్చిదిద్ది పర్యాటకులతో గైడ్‌లను పంపడం ద్వారా వారికి ఉపాధి, ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు స్థానిక సంస్కృతులతో వినోదం, మంచి ఆతిథ్యం ఇచ్చేలాగ స్థానిక ప్రాధాన్యతగల భోజనం, వసతి అందించాలని, వారి కాలం వృథా కాకుండా చూడగలగాలని, అలా చేస్తే విలేజ్ టు వెస్సెల్ భావన అమలౌతుందని అన్నారు. స్థానిక గ్రామస్తుల్లో చేతివృత్తిదారులకు ఉపాధి కల్పించాల్సి ఉందన్నారు. దీనికోసం మౌలిక వసతులు దేశంలోని వివిధ పోర్టుల చుట్టుపక్కల గ్రామాల్లో అభివృద్ధి చేయాల్సిన అవసరం పోర్టులకు ఉందన్నారు.

వివాహాలు, పుట్టినరోజుల సందర్భంగా సముద్రంపై 'వేడుక'

సముద్రంపై వేడుకలకు 'క్రూయిజ్ వెస్సెల్స్' వినూత్నంగా ఉపయోగపడతాయని యోగేష్ షా వెల్లడించారు. బాగా ధనవంతుల ఇంట్లో పెళ్లిళ్లు.. పుట్టినరోజులప్పుడు ఒక్కోసారి వేదికలు దొరక్కపోవచ్చని, అలాంటి సందర్భాల్లో ఒక భారీ వెస్సెల్ (క్రూయిజ్) నౌకను ఒకరోజుకు ఇలాంటి వారు తీసుకుని వేడుక జరుపుకునే అవకాశం కూడా ఉందని తెలిపారు. దీనివల్ల క్రూయిజ్ రెవెన్యూ భారీగా పెరుగుతుందన్నారు. తక్కువ ఆర్థిక స్థోమత కలిగిన వారికి సైతం 'చిన్న సైజు వెస్సెల్స్'ను వాడుకునే సౌకర్యాన్ని పోర్టులో ఉండేలా చూడాలన్నారు. భారత ప్రభుత్వం సాగరమాల ద్వారా తీర ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పోర్టుల్లో టెర్మినల్స్‌ను ఆధునికీకరించడం చేయాలని, ముంబయి, చెన్నయ్, న్యూ మంగళూరు, విశాఖపట్నం, కొచ్చిలలో ఇప్పటికే ఆ ప్రయత్నం జరిగిందని అన్నారు.

క్రూయిజ్ టూరిజంపై జరిగిన పేనలిస్టుల చర్చకు మోడరేటర్‌గా ఎన్ఎంపిఎ ఛైర్మన్ డాక్టర్ వెంకటరమణ అక్కరాజు, ట్రేడ్ మినిస్ట్రీ ఆఫ్ ఇండస్ట్రీ కామర్స్ అండ్ ఎంప్లాయిమెంట్ - భూటాన్ నుంచి సోనమ్ బూమ్ తా మాట్లాడుతూ బే ఆఫ్ బెంగాల్‌లో ప్రస్తుత క్రూయిజ్ టూరిజంలో మూడు మిలియన్ల పాసింజర్లు మాత్రమే ఉన్నారని, దీన్ని మూడు రెట్లు పెంచుకునే అవకాశాలున్నాయని అన్నారు.

గెలాక్సీ జెడ్ సిరీస్ ఆర్డర్లు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలోని అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, అధునాతనమైన గెలాక్సీ జెడ్‌సిరీస్, గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 7, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 7 కోసం ముందస్తు ఆర్డర్లు తీసుకోవడం ప్రారంభించినట్లు సంస్థ గెలాక్సీ శ్రేణి హెడ్ ఆదిత్య తెలిపారు.

డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 7 ఇప్పటివరకు గెలాక్సీ జెడ్ ఫోల్డ్ సిరీస్‌లో ఉన్న అతి సన్నని, తేలికైన అత్యుత్తమమైన గెలాక్సీ డిజైన్, కెమెరా కార్యాచరణ, ఏఐ ఆవిష్కరణలను కలిగి వుందన్నారు. ఇది అల్ట్రా-స్మార్ట్‌ఫోన్ యొక్క ప్రీమియం పనితీరు, అనుభవాన్ని అందిస్తుందన్నారు. అదే సమయంలో ఫోల్డ్ తెరిచినప్పుడు పెద్ద డిస్‌ప్లేతో నూతన స్థాయి సామర్థ్యం, ఉత్పాదకతను అందిస్తుందని చెప్పారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లుతోపాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నం జిల్లా పరిషత్ జంక్షన్ దగ్గరలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం భవనం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు మాత్రమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కూడా నష్టపరిచే ఆర్థిక బిల్లు అమలును ఆపాలన్నారు. కేంద్రంలో 8వ వేతన కమిషన్‌ను, రాష్ట్రంలో 12వ వేతన కమిషన్‌ను వెంటనే నియమి ంచాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డిఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి, రిటైర్డ్ జిల్లా ట్రెజరీ ఆఫీసర్ జె.సత్యారావు, అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి టివి.రమణమూర్తి, ఉపాధ్యక్షులు అప్పలనాయుడు, పైలా రామలింగేశ్వరరావు, కోశాధికారి టి.గోపాలకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఉమెన్స్ వింగ్ బి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

చీరల పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఎస్సి, ఎస్టి ఆఫీసర్స్, ఎంప్లాయిస్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో పోర్టు యాజమాన్యం సహకారంతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. నగరంలో జ్ఞానాపురంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో 200 మంది మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా పలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం.దేవేశ్వరరావు, ఎం.సత్య నారాయణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఉద్యమ స్ఫూర్తితో 'పే బ్యాక్ టు సొసైటీ' 'లక్ష్యసాధన'లో భాగంగా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఈసరి లక్ష్మి పాల్గొన్నారు.

19న ప్రత్యేక మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 19న డాటాప్రొ, ద్వారకానగర్ క్యాంపస్‌లో ప్రత్యేక మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్లు రంగినేని సాయిప్రసాద్ సిద్ధవరపు ప్రసాద్ తెలిపారు. సోమవారం దీనికి సంబంధించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నెలా మూడో శనివారం డాటాప్రొ జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల డాటాప్రొ 35వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జాబ్‌మేళాలో ప్రముఖ ఐటి నాన్-ఐటీ కంపెనీలు పాల్గొనబోతున్నాయన్నారు.

హారికకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కృష్ణా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, బిసి నాయకురాలు ఉప్పాల హారికపై టిడిపి వారు చేసిన దాడిని ఖండిస్తూ, మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వైసిపి మహిళా నేతలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కె.కె రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మండిపడ్డారు.

వినియోగదారులకు చేరువగా స్కోడా సర్వీస్ సెంటర్లు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: స్కోడా ఆటో ఇండియా సంస్థ దేశవ్యాప్తంగా 300 టచ్ పాయింట్లను చేరుకుందని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా తెలిపారు. నగరంలోని స్కోడా షోరూంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 172 నగరాల్లో 300 కస్టమర్ టచ్ పాయింట్లతో తమ సంస్థ కొత్త మైలురాయి అందుకుందన్నారు.

మయోపియా దృష్టి లోపంపై అవగాహన

ఎల్‌వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ కౌసల్య అక్కినేని



ప్రజాశక్తి - ఆరిలోవ : వేగంగా పెరుగుతున్న మయోపియా దృష్టిలోపం పట్ల ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల మయోపియా స్పెషలిస్ట్ డాక్టర్ కౌసల్య అక్కినేని చెప్పారు. పిల్లల్లో వేగంగా పెరుగుతున్న మయోపియా కంటి వ్యాధి పట్ల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలను ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాల, జిఎంఆర్.వరలక్ష్మి క్యాంపస్, విశాఖపట్నం నేత్ర వైద్యబృందం ఆధ్వర్యాన చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మయోపియా పెరగడం గమనిస్తే ఇది 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం మందికి అంటే ప్రతి ఇద్దరిలో ఒకరు ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. సాధారణంగా -6.00 కంటే ఎక్కువ డయోప్టర్‌లు ఉన్న పిల్లల జీవితంలో తరువాతి కాలంలో అంధత్వ సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వివరించారు. మయోపియా వ్యాధి సోకిన పిల్లలు దగ్గర వస్తువులను స్పష్టంగా చూడగలుగుతారు కాని దూరపు వస్తువులు అస్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. ఈ విషయాన్ని తరగతి గదులలో ఉపాధ్యాయులు గమనించవచ్చని పేర్కొన్నారు. కొందరు పిల్లలు బోర్డు మీద కనిపించే వాటిని చూసి రాసుకోలేక పక్కవారి నోట్స్ చూసి రాస్తుంటారని, కళ్లు తిరగడం, తరచుగా కళ్లు రుద్దడం, స్క్రీన్‌లు లేదా పుస్తకాలు ముఖం దగ్గరగా పెట్టుకోవటం, తరగతిలో బోర్డును చూడటంలో ఇబ్బంది పడటం వంటివి మయోపియా వ్యాధికి హెచ్చరిక సంకేతాలని వివరించారు. దీనిని గుర్తించటంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకం అన్నారు. ఈ వ్యాధికి జన్యుపరమైన, జీవనశైలి రెండూ కారణమని తెలిపారు. పిల్లలు చదవడం లేదా స్మార్ట్ ఫోన్లు చూస్తూ గంటల తరబడి గడపకుండా కొంచెం సేపు అయినా బహిరంగ ప్రదేశాలలో ఆడుకునే విధంగా చూడాలని సూచించారు. తగినంత సమయం బయట గడపక పోవటం కూడా మయోపియా పెరుగుదలకు కారణమవుతోందని తెలిపారు. ఆరోగ్యకరమైన అలవాట్లను పిల్లలలో ప్రోత్సహించాలని, ముఖ్యంగా సహజమైన సూర్యకాంతిలో గడపటం, బహిరంగ ఆటలు, నడక, సైకిల్ తొక్కటం వంటివి ప్రోత్సహిస్తే ధృడమైన శరీరంతో పాటు ఆరోగ్యకరమైన దృష్టిని అందిస్తాయని పేర్కొన్నారు. పిల్లల మయోపియాను ముందస్తుగా గుర్తించిన తర్వాత, దిద్దుబాటు అద్దాలు, పరిధీయ డిఫోకస్ డిజైన్‌లతో కూడిన కాంటాక్ట్ లెన్సులు, తక్కువ మోతాదులో అట్రోపిన్ కంటి చుక్కలు, బహిరంగ కార్యకలాపాలను పెంచడం, స్క్రీన్ సమయాన్ని తగ్గించడం తదితర జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దృష్టి సమస్యలు తలెత్తినప్పుడు నిపుణులను సంప్రదించడంలో ఆలస్యం చేయకూడన్నారు.

నేరాలు ఘోరాలు

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని జోడుగుళ్ల జంక్షన్ వద్ద సోమవారం ఉదయం గుండెపోటుతో లారీ డ్రైవర్ హఠాన్మరణం పొందిన ఘటన చోటుచేసుకుంది. స్థానిక సిఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలివి. కృష్ణా జిల్లా విజయవాడ జక్కంపూడి వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన కొల్లూరి రామ్మోహన్‌రావు (56) అనే లారీ డ్రైవర్ ఈనెల 13న పిడుగురాళ్ల నుండి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ లోడుతో కొత్తవలస వచ్చాడు. అక్కడ సగం సరుకును అన్‌లోడ్ చేసి, మిగతా వంద బస్తాలను జోడుగుళ్ళ బొమ్మల కంపెనీలో ఆన్‌లోడ్ చేసేందుకు వచ్చాడు. ఉదయం 6:30గంటలకు అక్కడ ఎదురుగా ఉన్న హోటల్‌కు వెళ్లి టిఫిన్ అడగ్గా, తయారవ్వలేదని చెప్పడంతో ఎదురుగా ఉన్న స్తంభం దగ్గరికి వెళ్లి కూర్చున్నాడు. 10 నిమిషాల తర్వాత పక్కకు పడిపోవడంతో టిఫిన్ సెంటర్ యజమానితోపాటు మరికొంతమంది చూడగా అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి, 108కి ఫోన్ చేసి రప్పించారు. 108 సిబ్బంది వచ్చి పరీక్షించి, అప్పటికే గుండెపోటుతో రామ్మోహనరావు మృతి చెందినట్లు నిర్ధారించారు కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం పొట్టివాడలో ఉన్న మృతుని కుమార్తె షేక్ బరకత్ ఉన్నిషాకు సమాచారం ఇచ్చారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

దాడి కేసులో 10 మంది అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : యువకునిపై దాడి చేసిన పదిమందిని గాజువాక ఎస్ఐ నజీర్ అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం...బిసి రోడ్డులో వై.జీవన్ నివాసముంటూ ఫైబర్ నెట్ వర్క్‌లో ఉద్యోగం చేస్తున్నారు. గత కొంతకాలం క్రితం గాజువాకలో నివాసం ఉంటున్న నలుగురు వ్యక్తులతో వివాదం జరిగింది. ఆ గొడవలో గాయపడిన నలుగురు మరో ఆరుగురిని తీసుకొని వచ్చి మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో జీవన్ ఇంటికెళ్లి కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో జీవన్ గాయపడ్డారు. ప్రస్తుతం హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. దాడిచేసిన పది మందిపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

పార్కుల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి జోన్-2 పరిధిలోని పార్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జోన్ 2 పట్టణ ప్రణాళిక అధికారి తిరుమలరావు తెలిపారు. జివిఎంసి 8వ వార్డు పరిధిలోని ప్రయివేటు పాఠశాల సమీపంలో ఉన్న 3800 గజల్లో ఉన్న పార్క్ స్థలంలో వేసిన అనధికార రేకుల షెడ్డును మంగళవారం తొలగించారు. అనంతరం అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ, జోన్ పరిధిలోని పార్కుల్లో ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పోలినాయుడు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలో ముత్యాలమ్మ తల్లి వారాలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ తల్లి మంగళవారం వారోత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామస్తులందరూ అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించుకున్నారు. భారీ స్థాయిలో ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షునిగా రమణ



ప్రజాశక్తి - ఆనందపురం : విశాఖపట్నం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షునిగా సీనియర్ నేత పడాల రమణను నియమితులయ్యారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తానన్నారు. ఈ పదవి రావడంతో పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎపిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిలారెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షులు అదల వెంకటవర్మ రాజు (హసిని వర్మ) తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి కొత్తపాలెంలో ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించిన వరి విత్తనాలను స్థానిక కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ ఆధ్వర్యాన మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి నవీన్, రైతులు సూరిశెట్టి అప్పారావు, దాడి సుందర్రావు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఆరిలోవ, విశాఖ కలెక్టరేట్ : ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడంలో సంబంధిత అధికారులు తగిన చొరవ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ డిమాండ్ చేశారు. జీతాలు చెల్లింపులో సంబంధిత అధికారులు చొరవ తీసుకోకపోవడంతో జీతాలు రావడానికి ఇంకా ఎంత సమయం పడుతుందోనన్న ఆందోళనలో ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. జూన్ 15వ తేదీ నాటికి బదిలీ ప్రక్రియ పూర్తయి, ఆయా స్థానాల్లో ఉపాధ్యాయులు చేరారని పేర్కొన్నారు. పొజిషన్ ఐడి సమస్యలున్న ఉపాధ్యాయులు మినహాయించి, క్లియర్ వేకెన్సీలో చేరి ఎల్‌పిసిలు సమర్పించిన ఉపాధ్యాయులకు జులై 6 నుంచి 10వ తేదీలోపు సప్లిమెంటరీ బిల్లులు పెట్టాల్సి ఉండగా సిఎంఎఫ్ సైట్ 10వ తేదీతోనే ఆపివేయడం వలన నిర్ణీత సమయంలో బిల్లులు సమర్పించని కారణంగా మరో నెల రోజులు పాటు జీతాలు అందని పరిస్థితి ఉపాధ్యాయులకు నెలకొందని తెలిపారు. ఎటువంటి సాంకేతిక సమస్యలు లేని ఉపాధ్యాయులకు బిల్లులు సకాలంలో పెట్టడంలో సంబంధిత అధికారులు వైఫల్యం చెందారని విమర్శించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జులై 16వ తేదీ నుంచి మరలా ప్రారంభం కానున్న సిఎంఎఫ్ సైట్లో సప్లిమెంటరీ బిల్లులు అప్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుని ఉపాధ్యాయులకు జీతాలు అందేందుకు సహకరించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 6వ వార్డులో రూ.1.77 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వార్డులో ఏడాది కాలంలో రూ.5 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. 2014- 19 మధ్యలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను కూటమి ప్రభుత్వమే మళ్లీ పూర్తి చేస్తుందన్నారు. నిరుద్యోగ భృతి వంటి హామీలను తొందర్లోనే అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆర్‌హెచ్. కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. అర్హులైన వారికి పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. స్థానికంగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, 6వ వార్డు నాయకులు గరే గురునాథ్, లొడగల జానకీరామ్, మాన్యాల సోంబాబు, మొల్లి లక్ష్మణరావు, బోయి వెంకటరమణ, పోతిన ప్రసాద్, నాగోతి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్ శ్రీవాణి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షార్ట్ టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా డేటా ప్రో కంప్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో కోర్సు పూర్తి చేసిన నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. సైబర్ సెక్యూరిటీ ఎథికల్ హ్యాకింగ్ అంశంపై ఆన్‌లైన్ ద్వారా మే 5 నుంచి జూన్ 28వ తేదీ వరకు తరగతులు జరిగాయని తెలిపారు. దీని వల్ల సైబర్ నేరాల పట్ల ఎలా అప్రమత్తంగా ఉండాలో అవగాహన ఏర్పడిందన్నారు.



రైతు పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలు వేయిస్తున్న అధికారులు

ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కోరాడలో రైతు ఎన్.పూర్ణచంద్రరావుకు ఉచితంగా ఆయిల్‌పామ్ మొక్కలను అధికారులు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఎపి ఎంఐపి పీడీ కె.మన్మధరావు మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ తోటలతో రైతులకు లాభాలు వస్తున్నాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ తోటల అభివృద్ధి కోసం మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఈనెల 15 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమయంలో రైతులకు ఉచితంగా ఆయిల్‌పామ్ మొక్కలు సరఫరా చేస్తామన్నారు. ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసే రైతులకు తప్పనిసరిగా సాగునీటి సౌకర్యం ఉండాలన్నారు. ఆయిల్‌పామ్ పంట దశకు వచ్చినప్పుడు ప్రభుత్వమే ధర నిర్ణయించి కంపెనీలకు అమ్మకాలు చేస్తుందన్నారు. ప్రస్తుతం టన్ను ధర రూ.17వేలు పైబడి ఉందన్నారు. ఉద్యానవన శాఖాధికారులు బి.శ్యామల, భాను పుష్ప, ఐఫోన్ కంపెనీ మేనేజర్ శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి -ఆనందపురం : పద్మనాభం జిల్లా పరిషత్ హైస్కూల్ 2008-09 విద్యాసంవత్సరం 10వ తరగతి విద్యార్థులు ఆనందపురం మండలం గుడిలోవలోని అనన్య రిసార్టులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువుకున్న రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. భవిష్యత్తులో తరచూ ఇలా కలుసుకునే విధంగా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జనార్ధన్, మహేష్, శివప్రసాద్, సూర్యనారాయణ, శేఖర్, ఉపాధ్యాయులు జయప్రసాద్, కిషోర్, ఆదిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలపై రేపు సదస్సు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎపి ఇపిడిసిఎల్ విశాఖపట్నం సర్కిల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం పద్మనాభం సెక్షన్‌లో గురువారం సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. పద్మనాభం సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే కార్యక్రమంలో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను కమిటీకి తెలియజేయవచ్చని పేర్కొన్నారు. సీతమ్మధారలోని ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సిజిఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యల వివరాలను పరిశీలించి, విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912 ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ సదస్సులో చైర్మన్ బి.సత్యనారాయణతో పాటు సిజిఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.రాజబాబు, ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ పాల్గొంటారు.

నేడు ఈమా లైమ్ లైట్ అవార్డుల వేడుక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర నడిబొడ్డున ఈమా లైమ్ లైట్ అవార్డుల వేడుకను బుధవారం కన్నుల పండుగగా నిర్వహించనున్నట్లు వైజాగ్ ఈవెంట్ మేనేజర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్ కుమార్, షరీఫ్ ఖాన్‌లు సంయుక్తంగా తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎంవిపి.కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీచ్ రోడ్డులోగల గాదిరాజు ప్యాలెస్‌లో జరిగే ఈమా అవార్డుల వేడుకలో భాగంగా ఈవెంట్ రంగంలో ప్రతిభావంతులైన యాంకర్లు, సింగర్లు, డ్యాన్సర్లు, సౌండ్, లైటింగ్, ఎల్ఇడి టెక్నీషియన్లు, ఈవెంట్ ఇండస్ట్రీలో భారీ ప్రొడక్షన్లగల దిగ్గజాలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ముంబయి, కోల్‌కతా, బెంగళూరు, ఢిల్లీ తదితర నగరాల నుంచి సెలబ్రిటీ కళాకారులు ఈ ఈవెంట్‌లో ప్రదర్శన ఇచ్చేందుకు విశాఖకు వస్తున్నారని చెప్పారు. ఈ అవార్డుల వేడుకకు ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న కామాక్షి క్రాఫ్ట్ అధినేతలు వెంకటేష్, సిరి దంపతులు మాట్లాడుతూ విశాఖలో ఎంతో ప్రతిష్టాత్మకంగా, భారీ హంగులతో జరుగుతున్న ఈ ఈవెంట్ రాష్ట్రంలోనే ఒక ఐకాన్‌గా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ ఈవెంట్‌కు స్పాన్సర్‌గా వ్యవహరించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మీడియా సమావేశంలో సినీ నటుడు సమీర్, గాదిరాజు ప్యాలెస్ జిఎం మధు, ఈమా కార్యవర్గ సభ్యులు కామేష్ పాలూరి, సురేష్ కుమార్, జిఎన్.రాజు, సంతోష్ కుమార్, ఆనంద్ మోహన్, ఆశా పట్నాయక్, జగదీష్ పాల్గొన్నారు.

అశోక్‌గజపతిరాజుకు సత్కారం

ప్రజాశక్తి - వేపగుంట : సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త, విజయనగరం రాజవంశీయులు పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా రాష్ట్రానికి గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా దేవస్థానం తరుపున మంగళవారం సత్కరించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు, ఆలయ స్థానాచార్యులు టిపి.రాజగోపాల్, ఆలయ అర్చకులు కలిసి సత్కరించారు. ప్రత్యేక వేదాశీర్వచనాల అనంతరం, స్వామివారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదం, స్వామి వారి పటం అందజేసి అభినందనలు తెలియజేశారు. అశోక్ గజపతిరాజుకు ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి వాడ్రేవు రమణమూర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామరాజు శుభాకాంక్షలు తెలిపారు.



అశోక్‌గజపతిరాజును సత్కరిస్తున్న సింహాచలం దేవస్థానం సిబ్బంది

మహిళల అభివృద్ధితో దేశాభివృద్ధి

ప్రజాశక్తి -ములగాడ : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో నూతనంగా చేరిన విద్యార్థినులకు మూడు రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా 'మహిళాభివృద్ధి - వ్యూహాలు' అనే అంశంపై మంగళవారం ఆమె మాట్లాడుతూ, మహిళాభివృద్ధిని సాధించడం కోసం మహిళలంతా అక్షరాస్యులు, నైపుణ్యం సాధించి ఉపాధిని పొందాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంటులలో వారికి మూడో వంతు రిజర్వేషన్లు ఉండాలని, మహిళల రక్షణ, భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ ప్రభుత్వాలు చూపించాలని పేర్కొన్నారు. భేటీ బచావో- బేటి పడావో, ప్రధానమంత్రి ఉజ్వల యోజన తదితర పథకాలను శక్తివంతంగా అమలు చేయాలని, వారి ఆరోగ్య సంరక్షణకు తగినన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. మహిళా ఉద్యమాలు బలోపేతం కావాలన్నారు. అనంతరం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధానాలపై కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి బి.శాంతి ప్రసంగించారు. ఆత్మవిశ్వాసంతో అద్భుతాలు సాధించగలమని అన్నారు. తొలుత డాక్టర్ దుర్గాబాయి దేశ్ ముఖ్ జయంతి సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి మహిళా సాధికారతకు డాక్టర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రేణుక పాల్గొన్నారు.

ఆర్‌పిలకు ట్యాబ్‌ల పంపిణీ



ఆర్‌పిలకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : మెప్మా రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లను విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పెతకం శెట్టి గణబాబు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోన్- 5 కమిషనర్ బి.రాము, 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న, 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్ బాబు, కూటమి నాయకులు వైటిఆర్, మల్లి నాయుడు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసులో మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-లీగల్ : చదువుకుంటూ నిద్రిస్తున్న బాలికను లైంగికంగా వేధించారని అభియోగం రుజువైనందున నిందితునికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తూ నగరములోని చిన్నపిల్లల లైంగిక వేధింపుల కేసుల విచారణ ప్రత్యేక న్యాయమూర్తి (పోక్సో కోర్టు) పైడి మంగాకుమారి మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ భత్తి రాజశేఖర్ కథనం ప్రకారం... పాయకరావుపేట, శ్రీరాంపురం గ్రామానికి చెందిన బోడపాటి ఆనందకుమార్ 2022 జూన్ 17వ తేదిన అదే గ్రామానికి చెందిన పదవ తరగతి బాలిక చదువుకుంటూ ఒక గదిలో నిద్రపోయింది. పక్క గదిలో ఆమె తల్లిదండ్రులు నిద్రపోయారు. అర్థ రాత్రి రెండు గంటల ప్రాంతంలో నిందితుడు గది వెనుక తలుపుల నుంచి వెళ్లి బాలికను లైంగికంగా వేధించాడు. బాలిక కేకలు వేయగా పక్క గదిలో నిద్రిస్తున్న తల్లిదండ్రులు లేచి వచ్చారు. నిందితుడు వారిని గుద్దుకుంటూ పారిపోయాడు. అప్పట్లో పాయకరావుపేట పోలీసులకు బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జి.శిరీష దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రం కోర్టులో దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. జరిమానా విధించిన రూ.25 వేలును బాలికకు నష్టపరిహారంగా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన నిత్య అన్నప్రసాదానికి లక్ష రూపాయల విరాళాన్ని అక్కిరెడ్డిపాలెం పంచవటి టౌన్‌షిప్‌కు చెందిన టి.సుధాకరరెడ్డి, తాడి రామ నిర్మల మంగళవారం అందజేశారు. రూ.1 లక్ష చెక్కును ప్రోటోకాల్ కార్యాలయంలో పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరరావు సమక్షంలో జూనియర్ అసిస్టెంట్ వరాహనరసింహానికి అందించారు. ఈ విరాళంపై వచ్చే వడ్డీ ద్వారా ఏటా ఒక నిర్దిష్ట రోజున టి.సుధాకరరెడ్డి, తాడి రామనిర్మల దంపతుల పేరుమీద స్వామివారి నిత్య అన్నప్రసాదాన్ని భక్తులకు అందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా వారిని ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు స్వామివారి శేష వస్త్రముతో సత్కరించారు.

రెజ్లింగ్‌లో చంద్రంపాలెం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మధురవాడ : తిరుపతిలో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన గ్రాప్లింగ్ రెజ్లింగ్ అండర్ 14, అండర్ 17 బాలుర రాష్ట్ర స్థాయి పోటీల్లో చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటరావు తెలిపారు. ఈ పోటీల్లో పాఠశాల నుంచి పి.రవి, పదోతరగతికి చెందిన ఎల్.పవన్ కుమార్, 9వ తరగతికి చెందిన టి.నరేంద్రగోల్డ్ మెడల్, వై.సాయికుమార్ (10వ తరగతి) సిల్వర్, కె.పవన్, కె.దీపక్ సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, చైర్మన్ అభినందించారు.

యువజన నైపుణ్య దినోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం యువజన నైపుణ్య దినోత్సవం నిర్వహించారు. కళాశాలలో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందిన మహిళలనుద్దేశించి ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ మాట్లాడుతూ, చదువుతో పాటు వృత్తి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం వల్ల స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల స్థితిగతులపై నివేదిక ఇవ్వాలి : గంటా

ప్రజాశక్తి -భీమునిపట్నం, మధురవాడ : నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతమున్న స్థితి గతులపై వారం, పది రోజుల్లో సమగ్ర నివేదిక అందించాలని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. విశాఖ నగరంలోని ఎంవిపి.కాలనీలో ఉన్న అతని నివాసంలో మంగళవారం డిఇఒ ప్రేమకుమార్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఇఇ నరసింహారావుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఫర్నీచర్ కొరత ఉన్నందున నేలపై కూర్చుని చదువుతున్నారని, మరికొన్ని పాఠశాలల్లో సరిపడా తరగతి గదులు లేవని కొన్ని పత్రికల్లో కథనాలు వస్తున్నాయని వారి దృష్టికి తీసుకెళ్లారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రభుత్వ పాఠశాలల స్థితి గతులపై మీరు ఇచ్చే నివేదిక ఆధారంగా సిఎస్ఆర్ నిధుల ద్వారా సంబంధిత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.


జిల్లా కోర్టులో నేడు వన్ కే వాక్

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : మధ్యవర్తిత్వం జాతి శ్రేయస్సు అన్న నినాదంతో బుధవారం ఉదయం వన్ కే వాక్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న కేసులను సత్వరం పరిష్కరించే దిశగా మధ్యవర్తిత్వ విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, మధ్యవర్తిత్వ శిక్షకులు, సమాంతర న్యాయ సేవా సహాయకులు, విశాఖ న్యాయవాద సంఘం ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొంటారని, నగర పౌరులు పాల్గొని విజయవంతం చేయాలని న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు కోరారు.

కాంగ్రెస్ పెందుర్తి కో-ఆర్డినేటర్‌గా రాము



ప్రజాశక్తి -పెందుర్తి: కాంగ్రెస్ పార్టీ పెందుర్తి అసెంబ్లీ కో-ఆర్డినేటర్‌గా విన్నకోట రాము నియమితులయ్యారు. గతంలో విన్నకోట రాము షిప్‌యార్డులో ఐఎన్‌టియుసి బేరర్‌గా మూడుసార్లు చేశారు. పెందుర్తిలో కూడా అనేక సేవా కార్యక్రమాలు చేశారు. గత ఎన్నికల్లో 95వ వార్డు కార్పొరేటర్‌గా కాంగ్రెస్ తరుపున పోటీచేశారు. ఈ సందర్భంగా విన్న కోట రాము మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన సేవలను గుర్తించి తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పార్లమెంటరీ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎపిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిలారెడ్డి, అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మీసాల సుబ్బన్నకు కృతజ్ఞతలు తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న బిఎస్ఎస్.శశి

జర్నలిస్టు శశికి శ్రీగురు పురస్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : జర్నలిజంలో అందించిన సేవలకు గాను శ్రీగురు పురస్కారం- 2025ను నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బిఎస్ఎస్.శశి అందుకున్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో అఖిల భారతీయ మహా సంఘ్ ఆంధ్రప్రదేశ్ విభాగం ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి సాహితీ పండితుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి శ్రీగురు పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఎక్స్‌ప్రెస్ టుడే తెలుగు దినపత్రిక ఎడిటర్, విశాఖ నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బిఎస్ఎస్ శశి, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ మనవడు డాక్టర్ సుబ్రమణ్య శర్మ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బ్యాంక్ కాలనీ, మామిడిపాలెం, దెక్కతి పాలెం గ్రామాలకు చెందిన 50 మంది పేద విద్యార్థులకు మంగళవారం ఉచితంగా నోటు పుస్తకాలు, కంపాస్ బాక్స్‌లు పంపిణీ చేశారు. గ్రేస్ హ్యాపీ నెస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన చేపట్టిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధినేత పి.నవీన్‌కుమార్ మాట్లాడుతూ, రానున్న రోజుల్లో ఉచిత వైద్య శిబిరాలు, పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం డ్వామా పిడి ఆర్.పూర్ణిమాదేవి పరిశీలించారు.బుచ్చయ్యపేటలో కాలువ పనులను పరిశీలించి.ఉపాధి కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం పనులు రూ.307 వేతనం పొందాలని సూచించారు. వడ్డాది గ్రామల్లో సయ్యపురెడ్డి మాధవరావు పొలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన కొబ్బరి మొక్కల పెంపకం, మొక్కలు మధ్య త్రవ్విన రింగ్ ట్రెంచ్ వర్క్స్, ఫారంపాండ్ పనులను పరిశీలించి, రైతుతో మాట్లాడారు. లబ్ధిదారు మాధవరావు మాట్లాడుతూ.ఉపాధి నిధులతో రెండెకరాల్లో 120 కొబ్బరి మొక్కలు నాటామని,ప్రస్తుతం ఫల సాయానికి వచ్చాయని ఆనందం వ్యక్తం చేశాడు. కార్యక్రమంలో ఎంపిడిఒ భానోజీరావు, ఎపిఒ వరహాలరావు సిబ్బంది పాల్గొన్నారు.

'విజిలెన్స్ కమిటీలో అందరికీ ప్రాధాన్యత'

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీల్లో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ ఎస్‌సి, ఎస్‌టి పిఒఎ జిల్లా సభ్యుడు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్‌పిలను కలిసి మాల మాదిగ రెల్లి నాయకులు వినతి పత్రాలు సమర్పించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో రేబాక మధుబాబు, ఎంఆర్‌పిఎస్ నాయకుడు కట్టుమూరి మంగరాజు, జిల్లా దళిత బహుజన ఆదరణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొల్లి చిన్న అప్పారావు, దళిత సంఘం నాయకుడు చెవ్వేటి అప్పారావు పాల్గొన్నారు.

కార్మికుల వేతన సమస్యపై ఆరా

ప్రజాశక్తి -చోడవరం : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే కెఎస్ఎస్ఎన్ రాజు సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. తమకు మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని స్థానిక పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఇటీవల ఎమ్మెల్యే రాజును స్వయంగా కలిసి సమస్యను విన్నవించడంతో ఈ మేరకు స్పందించారు. ఎంపిడిఒతో కలిసి వెళ్లి పంచాయతీ ఇఒ శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కార్మికుల వేతనాలు చెల్లింపులో జాప్యంపై ప్రశ్నించారు. సిబ్బంది పన్నులు వసూలు చేసి సొంత అవసరాలకు వాడుకోవడంపై మండిపడ్డారు. వెంటనే వాటిని వసూలు చేయాలని ఆదేశించారు. ఏడాది పంచాయతీ ఆదాయం, జమాఖర్చులపై ఆరా తీశారు. కార్మికుల వేతనాలు చెల్లింపుపై సూచనలు చేశారు. సర్పంచ్ బండి నూకాలమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలో విలీనం చేయండి

• ఎపిఇపిడిసిఎల్ జిఎంకు జెఎల్ఎం గ్రేడ్ -2 ఎనర్జీ అసిస్టెంట్ల వినతి



జిఎం(హెచ్ఆర్) సుమన్ కల్యాణికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- అనకాపల్లి : తమను విద్యుత్ సంస్థలో విలీనం చేసి, ప్రమోషన్ కల్పించాలని ఎపిఇపిడిసిఎల్ జెఎల్ఎం గ్రేడ్ 2 ఎనర్జీ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థ ఉద్యోగులతో ఏర్పాటైన త్రిసభ్య కమిటీ మంగళవారం సంస్థ హెచ్ఆర్‌డి జనరల్ మేనేజర్ డి సుమన్ కల్యాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమను విద్యుత్ సంస్థలో పూర్తిగా విలీనంచేసి, అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ప్రమోషన్ ఇవ్వాలని, ఎపిఎస్ఇబి సర్వీస్ రూల్స్, టైం స్కేల్ వర్తింపజేయాలని కోరారు. ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ చేపడుతున్నామన్నారు. దీనిపై జిఎం స్పందిస్తూ, జెఎల్ఎం-2 విషయంలో యాజమాన్యం ఆలోచిస్తోందని, తప్పక న్యాయం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ సత్యారావు, పి శ్రీనివాసరావు, పి చంద్రశేఖర్, గ్రేడ్ టు జేఎల్ఎం నాయకులు ఎస్ అప్పలరాజు, కె.శంకరరావు, ఎస్.ఆదినారాయణ పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన



సాగునీటి కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని కొండుపాలెం దగ్గర పంటకాలువల పూడిక తీత పనులను స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సంబంధిత ఇరిగేషన్ డిఇఇ స్వామినాయుడు, నీటి సంఘాల ఛైర్మన్లు సభ్యులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పోతికొండ గడ్డ, శంకరం, రేబాక, వెదుళ్ళ గడ్డ, తుమ్మపాల నీటి సంఘం, చెర్లోపలి, పులి కాలువ సాగునీటి సంఘాల ద్వారా సుమారు రూ.2.37 కోట్ల నిధులతోకాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు.

.ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగునీటి రంగంపై తీవ్ర నిర్లక్ష్యం వహించడం వల్ల పంట కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఉపాధి హామీ పథకం, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌ల మధ్య సమన్వయం ఏర్పరచి, ఉపాధి కూలీలతో పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. తద్వారా రైతులకు వ్యవసాయానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినులకు మిషన్ వాత్సల్య సాయం



అంగన్వాడీ సందర్శనలో ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి

ప్రజాశక్తి- కె.కోటపాడు: మిషన్ వాత్సల్య పథకంలో 18ఏళ్ళ లోపు విద్యార్థులకు నెలసరి రూ.నాలుగు వేలు చొప్పున రెండేళ్లపాటు ఆర్థిక సాయం అందచేస్తున్నామని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి తెలిపారు. మంగళవారం మండలంలోని సింగదొరపాలెం, ఎ.కోడూరు గ్రామాల్లో మూడు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రీస్కూల్, గ్రోత్ మానిటరింగ్, ఎఫ్ఆర్ఎస్., స్టాక్స్, మెడిసిన్ కిట్స్‌ను పరిశీలించారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ, 18ఏళ్ల వరకు ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లి వచ్చే విద్యార్థినులకు పోషకాహారం, రవాణా, ఆరోగ్య ఖర్చులకు ప్రతినెలా రూ.నాలుగు వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తోందన్నారు.. మిషన్ వాత్సల్య పథకం కింద 2024-2025 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు రూ.1.42కోట్లు మంజూరుకాగా, తొలివిడతలో 332మంది విద్యార్థులకు రూ. 19.92లక్షలను రెండో విడతలో నూతన విద్యార్థులు 408మందికి రూ.1.22కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. పిల్ల విద్య, వైద్యం, ఆరోగ్యం కోసమే ఆ డబ్బులు ఖర్చు చేయాలని తల్లిదండ్రులకు పీడీ సూర్యలక్ష్మి సూచించారు. సిడిపిఒ లలితకుమారి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు సుశీల, అనిత ఉన్నారు.

శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు



రోడ్డును శ్రమదానంతో బాగు చేసుకుంటున్న గిరిజనులు

ప్రజాశక్తి - రోలుగుంట : రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ కొండశిఖర గ్రామమైన పెద్దగరువు రోడ్డును మంగళవారం స్థానిక గిరిజనులు శ్రమదానంతో బాగు చేసుకున్నారు. గ్రామంలో 12 కుటుంబాలు జీవిస్తున్నాయి. భారీ వర్షాలకు ఈ రోడ్డు కొట్టుకుపోవడంతో పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. దీంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వారంతా ఏకమై ఆ రోడ్డును బాగు చేసుకున్నారు. రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో అంబులెన్స్ వంటి వాహనాలు రావడం లేదని, డోలీ మోతలు తప్పడం లేదని, ఇప్పటికైనా స్పందించి నాణ్యమైన రోడ్డును ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు.

అరకొరగా అచ్చెర్ల సచివాలయం

• పునాదుల స్థాయిలో నిలిచిన భవన నిర్మాణం



పునాదులతో ఆగిపోయిన సచివాలయ భవనం

ప్రజాశక్తి- కశింకోట మండలంలో అచ్చెర్ల గ్రామంలో నిర్మిస్తున్న సచివాలయ భవనం పునాదుల స్థాయిలోనే అర్ధాంతరంగా నిలిచిపోయింది. అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, గవినిపేట గ్రామ ప్రజలకు సేవలు అందించేందుకు అచ్చెర్లలో ఏర్పాటైన గ్రామసచివాలయ కార్యకలాపాల నిర్వహణకు ఇక్కడ భవన నిర్మాణం చేపట్టారు. అయితే ఇది పునాదుల స్థాయిని దాటకుండా నిలిచిపోవడంతో వసతి సమస్యలో సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులు పడకతప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టడంతో ఎందుకు నిలిచిపోయిందో తెలియని స్థితి ఉంది. ఇప్పటికైనా స్థానిక నేతలు, అధికారులు దీనిపై దృష్టి సారించి భవన నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జీవనానికి నైపుణ్యత ఆధారం

ప్రజాశక్తి- దేవరాపల్లి : గ్రామీణ యువతకు నైపుణ్యం అలంకారంగా కాక, ఆధారంగా మారాలని బేతపూడి కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారిణి సిహెచ్. భువనమాధురి అన్నారు. నైపుణ్యం ఉంటే ఎవరిపైనా ఆధారపడకుండా జీవనమార్గాన్ని ఏర్పరచుకోవచ్చన్నారు. మంగళవారం ప్రపంచ నైపుణ్య దినోత్సవం సందర్భంగా బహుళ కార్యాచరణలతో కూడిన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌందర్య శిక్షణ నైపుణ్యంలో అభ్యసిస్తున్న బాలికలు తమ కలల ప్రపంచాన్ని చిత్రాలుగా మార్చగా, భవిష్యత్తుకు వృత్తివిద్యా కోర్సులు బాసటగా నిలుస్తాయనే సందేశంతో విద్యార్థినులు ప్రదర్శించిన ప్లకార్డులు ఆకట్టుకున్నాయి.క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు పాఠశాల ప్రత్యేక అధికారిణి. భువనమాధురి బహుమతులు అందజేశారు. తెలుగు ఉపాధ్యాయిని దేవి వృత్తి విద్యా శిక్షణ ప్రాముఖ్యతను వివరించారు.

నాటకీయ రూపంలో నైపుణ్య కథ

ఒక నిరుపేద బాలిక నైపుణ్యంతో బ్యూటీషియన్‌గా మారి తన కుటుంబానికి ఆధారంగా మారిందో వినూత్నంగా చూపించే విద్యార్థినుల బహుళ పాత్రల నాటిక ఆకట్టుకుంది. పుస్తకాలు మాత్రమే కాదు, చేతిలో ఉన్న కళను ఆశ్రయంగా చేసుకొని జీవించగల సామర్థ్యం బాలికలలో ఉందని నాటిక స్పష్టం చేసింది. కార్యక్రమంలో బ్యూటీ అండ్ వెల్నెస్ ఒకేషనల్ ట్రైనర్ లకే సునీత, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

గొల్లగుంట శ్మశానవాటిక స్థలం సర్వే

• పిజిఆర్ఎస్ అర్జీకి అధికారుల స్పందన





రోవర్‌తో సర్వే చేస్తున్న సర్వేయర్, సిబ్బంది

ప్రజాశక్తి- పరవాడ: మండలంలోని రావాడ పంచాయతీ గొల్లగుంట గ్రామ ముస్లిం మైనారిటీల శ్మశానవాటిక స్థలాన్ని మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వేచేసి, హద్దులను గుర్తించారు. ఈ శ్మశానవాటిక స్థలం ఆక్రమణకు గురౌతోందని, దీన్ని పరిరక్షించాలని కోరుతూ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు నిర్వహించిన ప్రజాదర్బార్‌లో సమర్పించిన వినతికి స్పందన వచ్చింది. గ్రామస్తులు వినతిని పిజిఆర్ఎస్‌లో నమోదు చేయడం వల్ల సంబంధిత ఉన్నతాధికారులు స్పందించారు. మంగళవారం నునపర్తి విఆర్ఓ వెంకట్, సచివాలయ సర్వేయర్ గణేష్ శ్మశానవాటిక స్థలాన్ని సందర్శించారు. గ్రామస్తుల సమక్షంలో సర్వేయర్ గణేష్ రోవర్ యంత్రం ద్వారా కొలతలు చేసి, స్థలానికి స్పష్టమైన హద్దులను నిర్ణయించారు. గొల్లగుంట శ్మశానవాటిక స్థలం, నునపర్తి పంచాయతీ పరిధిలోని నడింపల్లి గ్రామ రెవెన్యూ సర్వే నెంబరు 2లో ఉందని గుర్తించారు. ఈ ప్రాంతంలో ప్రాచీన సమాధులు ఉన్నట్లు గుర్తించారు.

ఈ సందర్భంగా రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు మాట్లాడుతూ, సర్వే ఆధారంగా నివేదికను సిద్ధం చేసి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నోఏళ్లుగా ఉన్న శ్మశానవాటిక స్థలసమస్య పరిష్కారానికి గుర్తించిన హద్దుల ఆధారంగా ప్రహరీ నిర్మించాలని కోరారు.కార్యక్రమంలో గొల్లగుంట వార్డు సభ్యుడు షేక్ ఆలీ, నడింపల్లి విఆర్ఎ నూకరాజు, గ్రామస్తులు అక్బర్ ఆలీ, ఖలీల్, మదీనా, అజారుద్దీన్ పాల్గొన్నారు.

ఉత్తుత్తి శిక్షణతో నిధులు హాంఫట్!



ఒకే మిషన్ వద్ద ఇద్దరు, ముగ్గురేసి కూర్చుని శిక్షణ పొందుతున్న మహిళలు

- ప్రభుత్వ నిధులతో ప్రయివేటుకు భోజ్యం
- సౌకర్యాల్లేని శిథిల భవనంలో మహిళల ఇక్కట్లు
- కొందరికే మిషన్లుతో మొక్కుబడిగా శిక్షణ
- ఉచిత మిషన్ తప్ప, ఒరిగేదేమీ లేదని పెదవివిరుపు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మహిళల ఆర్థిక సాధికారత కోసం రూపొందించిన శిక్షణ పథకాలు నిర్వాహక ఏజెన్సీల పాలిట కాసులు కురిపించే కల్పవృక్షంగా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాల్లో అక్రమాలు, అవకతవకలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తూ, ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. శిక్షణ పేరుతో లక్షల్లో బడ్జెట్ వేసుకొని, కనీస వసతులు లేని భవనాల్లో, ప్రభుత్వ నిధులతో ప్రైవేటు సంస్థలు సాగిస్తున్న వ్యవహారం ఇపుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. వివరాలివి.

దేవరాపల్లి మండలంలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. దీని నిర్వహణను కార్డ్ అనే సంస్థ చూస్తోంది. మూడు నెలలపాటు శిక్షణనిచ్చి, విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు రూ. ఆరు వేలు విలువైన కుట్టుమిషన్‌ను ఉచితంగా ఇస్తారు. ఇందుకోసం కార్డ్ సంస్థకు ప్రభుత్వం ఒక్కో మహిళ కోసం రూ.23 వేలు ప్రజాధనం వెచ్చిస్తోంది. పూర్తి సదుపాయాలున్న భవనంలో నైపుణ్యత కలిగిన మాస్టర్లతో మహిళలకు శిక్షణనిచ్చి, వారికి స్వయం ఉపాధికి దోహదపడాలన్నది ప్రభుత్వం లక్ష్యం.

అయితే ఇక్కడ వాస్తవంగా జరుగుతున్నది అందుకు పూర్తి భిన్నంగా ఉందనే విమర్శలున్నాయి. మంచి సౌకర్యాలున్న ప్రయివేటు భవనంలో శిక్షణనివ్వాల్సిన నిర్వాహక సంస్థ శిథిలమైన, కనీస వసతుల్లేని ప్రభుత్వ భవనంలో కానిచ్చేస్తూ కాసులు వెనకేసుకుంటోందని ఆరోపణలున్నాయి. ప్రభుత్వం నుంచి ఒక్కో అభ్యర్థికి రూ.23వేలు నిధులను కేటాయిస్తుండగా, ఇందులో కుట్టుమిషన్‌కు రూ. ఆరువేలు పోను, మిగతా రూ.17వేలు శిక్షణకు వెచ్చించాలి. శిక్షణకు వారు వెచ్చించింది పాతిక కుట్టుమిషన్లు తప్ప ఇంకేమీ లేదని శిక్షణార్థులు అంటున్న పరిస్థితుల్లో అవన్నీ ప్రయివేటు ఖాతాకు వెళ్లిపోతాయని అంటున్నారు.

దేవరాపల్లి మండలంలో మూడు నెలల శిక్షణకు సుమారు 700 మంది దరఖాస్తు చేసుకోగా, ఉదయం సాయంత్రం రెండు బ్యాచ్‌లలో 140 మందిని శిక్షణకు ఎంపిక చేశారు. అయితే వీరిలో 124 మంది మాత్రమే శిక్షణ పొందుతున్నారు. కార్డ్ సంస్థ దీని కోసం ప్రయివేటు భవనం, పూర్తి సౌకర్యాలను సమకూర్చాల్సి ఉన్నప్పటికీ, పాత మండల పరిషత్ కార్యాలయంలోనే శిక్షణ కానిచ్చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో ప్రయివేటు సంస్థ కార్డు నిర్వహిస్తున్న శిక్షణకు ప్రభుత్వ భవనం అవసరమేమటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అలాంటప్పుడు దీనికి సంబంధించిన అద్దెను మినహాయిస్తున్నారా అని ప్రశ్నిస్తున్నారు. పాత ప్రభుత్వ భవనం కావడంతో ఇక్కడ కనీస సౌకర్యాలు లేవంటున్నారు. దేవరాపల్లి శిక్షణా కేంద్రంలో కంప్యూటర్లు లేకపోయినా, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను ఎందుకు నియమించారో అర్థం కావడం లేదంటున్నారు. సర్టిఫైడ్ టైలర్‌తో శిక్షణనివ్వాల్సింది పోయి, సాధారణ టైలర్‌తోనే శిక్షణను మమ అనిపించేస్తున్నారని అంటున్నారు.గతనెల 9న స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శిక్షణను ప్రారంభించగా, ఇప్పటికి నెలరోజులు గడిచినా దీనిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం విడ్డూరం. శిక్షణకు సరిపడా గదులు లేనప్పటికీ, వీటికి ఫండింగ్ ఇస్తున్న బిసి కార్పొరేషన్ యంత్రాంగానికి అదేదీ పట్టకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వయంత్రాంగం స్పందించి, తగు చర్యలు చేపట్టాలని శిక్షణార్థులతోపాటు స్థానికులు కోరుతున్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

దేవరాపల్లి కుట్టు శిక్షణా కేంద్రంలో సమస్యలు ఉన్నట్లు దృష్టికి వచ్చింది. త్వరలోనే వాటన్నిటిని పరిష్కరిస్తాం. మౌలిక సదుపాయాలతో కూడిన శిక్షణను అందిస్తాం.

జి. పెంటోజీరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బిసి కార్పొరేషన్, అనకాపల్లి జిల్లా

కనీస సౌకర్యాలు లేవు



స్వయం ఉపాధి లభిస్తుందనే ఆశతో, వ్యయ ప్రయాసలకు ఓర్చి సుమారు 15 కిలోమీటర్లు దూరం నుండి టైలరింగ్ నేర్చుకునేందుకు వస్తున్నాను. శిక్షణ కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేవు. అధికారులు స్పందించి, సదుపాయాలు కల్పించాలి. **- వరలక్ష్మి, బోయిలకింతాడ**

ఒకే గదిలో శిక్షణ



శిక్షణ కేంద్రానికి కేటాయించిన గదిలో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో రెండు బ్యాచులు శిక్షణ తీసుకుంటున్నాం. ఒకే గదిలో 25 మిషన్లు ఉండి చాలా ఇరుకుగా ఉంది. కుట్టు మిషన్లు సరిపోవడం లేదు. ఐదుగురు ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి. వర్షం వస్తే మిషన్లన్నీ తడిచిపోతున్నాయి. భవనం కారిపోతుంది. **- సుశీల, తెనుగుపూడి.**

19న చోడవరంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి -చోడవరం : స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 19న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. నియోజకవర్గం పరిధిలోని చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట, రోలుగుంట మండలాలతోపాటు చోడవరం పట్టణ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు పాల్గొని, అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. రాజ్యసభ సభ్యులు విజయేంద్ర ప్రసాద్ నిధులతో నిర్మితమైన హైస్కూల్లో డైనింగ్ హాల్ ప్రారంభోత్సవం ఉంటుందన్నారు.

ప్రశ్నించే పవన్ ఎక్కడ?

'బాబు ష్యూరిటీ...'లో బూడి ఎద్దేవా

ప్రజాశక్తి- కె.కోటపాడు: రాష్ట్రంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే గొంతుక నవుతా అంటూ గొప్పగా చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఎద్దేవా చేశారు. మంగళవారం కె. కోటపాడులో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'లో భాగంగా వైసిపి శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీలఅమలులో ఘోరవైఫల్యం చెందిన కూటమి ప్రభుత్వాన్ని పవన్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు.యాభై ఏళ్లకే పెన్షన్ల హామీ ఏమైందన్నారు. మాడుగుల నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధే తప్ప కూటమి ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదన్నారు. కె.కోటపాడు సిహెచ్‌సిని మందులు లేక అధ్వాన్నం చేసేశారని, ఊరూరా బెల్ట్‌షాపులున్నా చర్యల్లే వన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జగన్మోహన్, వైస్ ఎంపిపిలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల గోపి, గొరుపోటు వెంకటరావు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ధర్మశ్రీకి అభినందన

ప్రజాశక్తి -మునగపాక: ఎలమంచిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని మంగళవారం ఆయన నివాసంలో మండల వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, కాండ్రేగుల నూకరాజు, దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగ అప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, కోనపల్లి రామ్మోహన్రావు, కాండ్రేగుల జగన్, సుందరపు నీలకంఠస్వామి, దాసరి అప్పారావు పాల్గొన్నారు.

80వ వార్డులో హైమాస్ట్ వెలుగులు

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని 80వ వార్డు చినరామ స్వామి కోవెల, దేవుడు తోట, ఎన్టీఆర్ కాలనీ, కర్రి వారి వీధి ప్రధాన కూడలి పిళ్ళా వారి వీధి జంక్షన్ ఏర్పాటు చేసిన హైమాస్ట్ దీపాలను సోమవారం రాత్రి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ ప్రారంభించారు. స్థానిక కూటమి నాయకులు బొడ్డేడ మురళి, సూరిశెట్టి రాముడు, వార్డు టిడిపి అధ్యక్షులు బిఎస్ఎంకె. జోగినాయుడు జనసేన పార్టీ అధ్యక్షులు బుద్ధ శ్రీను ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు

. కార్యక్రమంలో విల్లూరి రమణబాబు, బొడ్డేడ నూకరాజు, కర్రి కళ్యాణ్, ఆళ్ల గొల్లబాబు, కర్రి శంకర్రావు, కర్రి నూకేశ్వరరావు, సిహెచ్ నూకరాజు, పెంటకోట గణేష్, బుద్ధ మనోహర్, మద్దాల శంకర్, మద్దాల మోహన్, బొడ్డేడ సురేష్, దొడ్డి జగదీష్, పీలా హేమ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎంసి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అర్జునరావు

ప్రజాశక్తి- అనకాపల్లి : జాతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ (ఎన్ఎస్ఎంసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనకాపల్లి జిల్లాకు చెందిన మామిడి అర్జునరావు నియామితులయ్యారు. మహారాష్ట్రలోని సోలాపూర్ అలంకార్ భవన్ లో అఖిల భారతీయ మజ్దూర్ సఫాయి కాంగ్రెస్ చీఫ్ జనరల్ సెక్రటరీ జయసింగ్ కచావా ఈ మేరకు ప్రకటించి, అర్జునరావుకు నియామక పత్రాన్ని అందజేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా బొమ్మాల దేవా, వైస్ ప్రెసిడెంట్‌గా మాడుగుల నాగ శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా మాడుగుల లక్ష్మి నియమితులయ్యారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలి అడుగు'



ఇంటింటా కరపత్రాల ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాబర్ ఆధ్వర్యంలో స్థానిక టిడిపి నేతలు మంగళవారం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు సీరం వెంకటలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షులు సిద్ది రెడ్డి ప్రసాద్, మండల నాయకులు మేడిశెట్టి నాగ రామ అప్పారావు పాల్గొన్నారు.

పెందుర్తి: జివిఎంసి 97వ వార్డు పరిధి కార్మికనగర్, గిరిప్రసాదనగర్-3 కాలనీల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జి, మేయర్ శ్రీనివాసరావు, 97వ వార్డు కార్పొరేటర్ వసంత శంకరరావు, నాయకులు ఆవగడ్డ అప్పలనాయుడు తైనాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి- కశింకోట: కంటిఆరోగ్యంపై ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ యశోద అన్నారు. మంగళవారం పిహెచ్‌సిలో మూలపేట, ఎన్.ఎస్.పురం గ్రామస్థులకు ఆరోగ్య సూచనలు చేశారు. కండ్ల కలకలు వచ్చినపుడు చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలని, వ్యక్తిగత రుమాలు వాడాలని, వ్యాధిసోకిన వారికి దూరంగా ఉండాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులకు డాక్టర్ మురళీకృష్ణ కంటిపరీక్షలు నిర్వహించారు.కార్యక్రమంలో సిబ్బంది సత్య నారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

106మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి- పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి గ్రామంలో మంగళవారమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీను ప్రారంభించారు. 106 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు, అందజేశారు. కంటి ఆపరేషన్లకు 32 మందిని ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి బస్సుల్లో తరలించారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ పి. వివేక్ వర్మ, క్యాంప్ మేనేజర్ అరుణ్ కుమార్, నర్సింగ్ స్టాఫ్ అమృత వర్షిణి సేవలు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు, ట్రస్ట్ సభ్యులు సింగంపల్లి రామారావు, లెక్కల సత్యనారాయణ మాస్టార్, వార్డు సభ్యులు వియ్యపు ముత్యాలు, గ్రామ కమిటీ కార్యదర్శి కొమ్మోజు రాజు, ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కరదీపికల పంపిణీ

ప్రజాశక్తి -చోడవరం : మండలంలో ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు అన్ని ప్రభుత్వ పాఠశా సబ్జెక్టు ఉపాధ్యాయుల కరదీపికలు మండల కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని ఎంఇఒలు లక్ష్మణరావు, సింహాచలం తెలిపారు. మంగళవారం ఉపాధ్యాయులకు వాటి పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ ఈ కరదీపిక సామర్థ్యాధారిత బోధనాభ్యసన ఉపాధ్యాయ వనరు అని, ఇది ఉపాధ్యాయులకు లెసన్ ప్లాన్, డైరీ, వార్షిక ప్రణాళికకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు అర్జునరావు, గరిమెళ్ల శ్రీను, గొల్లు శ్రీనివాసరావు, సిఆర్ఎంటిలు కెవిఎం.నాయుడు, సరోజిని, భూలక్ష్మి పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -మునగపాక: మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా దాడి అరుణ్‌కుమార్ (సుబ్బు), వెలగా జగదీష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షులుగా సబ్బి కృష్ణ, సహాయ కార్యదర్శిగా కోరుబిల్లి బుజ్జి, కోశాధికారిగా దాడి రమణబాబు ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీకి ప్రెస్‌క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ పథకాల అమల్లో ప్రభుత్వం విఫలం


మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు

ప్రజాశక్తి -చీడికాడ:వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు ఎన్నో పథకాలు అందించామని, నేడు కూటమి ప్రభుత్వంలో కొన్ని పథకాలను కూడా అందించలేక సతమతమవుతుందని, పూర్తిగా విఫలం అవుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఆరోపించారు. మండల కేంద్రంలో తులసి కళ్యాణ మండపంలో నిర్వహించిన బాబు షూరిటీ మోసం గ్యారంటీ పై మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూడి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పథకాలను పూర్తిగా అమలు చేయకుండానే నియోజకవర్గంలో ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమం చేపట్టడంతో ప్రజల వద్దకు ఆ పార్టీనాయకులు వెళ్లలేక పోతున్నారన్నారు. గత ప్రభుత్వంలో పథకాలు లబ్ధిదారులకు పూర్తిగా అందాయని, నేడు కూటమి ప్రభుత్వంలో ఎన్ని పథకాలు ప్రజలకు చేరువయ్యాయో సమన్వయం చేసుకోమని గ్రామస్థాయి నాయకులు ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలని ఆయన తెలిపారు కూటమి ప్రభుత్వం 50 సంవత్సరాలకే పింఛన్ మంజూరు చేస్తామని ప్రచారం చేసుకుందని, ఇప్పటికీ మంజూరు చేయకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన తెలిపారు. గత ప్రభుత్వంలో ఆడపడుచులకు కట్టుమిషన్లకు పదివేలు, నాయిని బ్రాహ్మణులకు సంవత్సరానికి 10000 రూపాయలు, రజకులకు కూడా పదివేలను వైయస్ జగన్ నేరుగా లబ్ధిదారి ఖాతాలో జమ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి అధ్యక్షులు మహేష్, మండల పార్టీ కన్వీనర్ రాజుబాబు, ఎంపిపి జయమ్మ, జడ్పిటిసి వరలక్ష్మి జానకిరామ్, నాయకులు సుంకర శ్రీను, సర్పంచ్లు మాజీ సర్పంచ్లు కార్యకర్తలు హాజరయ్యారు



మాట్లాడుతున్న బూడి ముత్యాలనాయుడు

పిఎసిఎస్ చైర్మన్‌గా బుజ్జి



ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి పిఎసిఎస్ చైర్మన్ గా ఉపమాక వెంకన్న ఆలయ మాజీ చైర్మన్, క్లస్టర్ ఇంచార్జ్ కొప్పిశెట్టి బుజ్జి నియమితులయ్యారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సిఫార్సు మేరకు ప్రభుత్వం సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపమాక గ్రామానికి చెందిన కొప్పిశెట్టి బుజ్జి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో కూడా ఉపమాక క్లస్టర్ పరిధిలో టిడిపికి అత్యధిక ఓట్లు రాబట్టి తన సత్తా చాటుకున్నారు.నక్కపల్లి పిఎసిఎస్ చైర్మన్ గా బుజ్జిని నియమించడంతో మంగళవారం సర్పంచ్ ప్రగడ వీరబాబు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు (శ్రీను), టిడిపి నాయకులు కొప్పిశెట్టి వాసు, తోలేటి శ్రీనివాస్, దొరబాబు, స్వామి, సుంకర శ్రీను తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



పనులు ప్రారంభిస్తున్న చైర్మన్

పాఠశాల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టి పాలెం పంచాయతీ జమ్మాదేవిపేట పాఠశాల నూతన భవన నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ భవన నిర్మాణానికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రూ.11.20లక్షలు మంజూరు చేయించారని స్కూల్ కమిటీ చైర్మన్ బత్తుల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పారావు మాస్టారు పాల్గొన్నారు.

ఎంఇఒ -2 గా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి -కోటవురట్ల:కోటవుర్ల మండల విద్యాశాఖ అధికారి 2గా లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఇక్కడ ఎంఈఓ 2 గా పనిచేసిన జోష్ గత నెల 30న పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం బాధ్యతలు తీసుకున్న లక్ష్మీనారాయణ పాములవాక జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు.



స్టేషన్‌ను సందర్శిస్తున్న డిఎస్‌పి

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -నక్కపల్లి:రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు సూచించారు. నక్కపల్లి పోలీస్ స్టేషన్ ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పలు కేసులు విషయంపై సిఐ కుమారస్వామితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాయకరావుపేట నుండి ధర్మవరం వరకు జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నామని, దీనివల్ల రోడ్డు ప్రమాదాలు, నేరాలు గుర్తింపునకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వాహనదారులు తప్పకుండా రోడ్డు నియమ నిబంధనలు, స్పీడు నియంత్రణ చర్యలు పాటించాలని సూచించారు. దీంతో రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చునన్నారు. నక్కపల్లి సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు, పోలీస్ సిబ్బంది అత్యధికంగా గంజాయి కేసులు పట్టుకోవడంలో మంచి ప్రతిభ కనబరిచారన్నారు. గంజాయి అడ్డుకట్టుకుంటూ వేసేందుకు నిరంతరం నిఘా ఉంటుందన్నారు.

నీటి తీరువా పన్నులు వసూలు చేయాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:నీటి తీరువా పన్నుల వసూలే ప్రధాన అజెండాగా గ్రామస్థాయి అధికారులు పనిచేయాలని తహసిల్దార్ తిరుమల బాబు సూచించారు. మంగళవారం కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీటి తీరువా పన్నుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని, ప్రధాన అజెండాగా వసూళ్లను చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.వివిధ పెండింగ్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయరాదని, ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్, ఆర్ఐ మణికంఠ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్



అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి విజయలక్ష్మి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి -కోటవురట్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో అందరూ బాధ్యతగా ఉండాలని కైలాసపట్నం గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి కోరారు. గ్రామంలో సచివాలయ సిబ్బందితో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలలో పారిశుధ్యం పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రమైన తాగునీరు అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో పూడికతీత పనులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఏ.ఎల్.పురం పంచాయతీ ఆర్టీసి కాంప్లెక్స్ సమీపంలో మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల వెళ్లే మార్గంలో డ్రైనేజీ నుంచి మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో సర్పంచ్ లోచల సుజాత స్పందించి మంగళవారం ఈ డ్రైనేజీ పూడికతీత తీయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పూడికను తీయిస్తున్న సర్పంచ్ సుజాత

జాబ్ మేళాకు విశేష స్పందన

-225 మందికి ఉద్యోగాలు
-జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గోవిందరావు



నియామకపత్రాలు చూపుతున్న అభ్యర్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి ద్వారా నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతి యువకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గోవిందరావు మాట్లాడుతూ నక్కపల్లిలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు సుమారుగా 16 బహుళ జాతీయ కంపెనీలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు హాజరయ్యాయని, 1500 ఖాళీలు వివిధ కంపెనీలో ఉన్నాయన్నారు. 10వ తరగతి నుండి పీజీ వరకు అలాగే ఐటి, డిప్లమో, బీటెక్, బిబిఏ, ఎంబిఏ, బిఏ, బీకాం, బీఎస్సీకి సంబంధించి ప్రతి ఒక్క నిరుద్యోగి ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టిడిపి నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, నాలుగు మండలాల టిడిపి మండల శాఖ అధ్యక్షులు, ఇతర నాయకులు మాట్లాడారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో జాబ్ మేళాను నిర్వహించడం జరిగిందన్నారు. జాబ్ మేళాలో 545 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకాగా 225 మంది ఎంపిక కావడం జరిగిందని, సుమారు 60 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించామని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గోవిందరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.సీతారామరాజు, కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, అమలకంటి అబద్ధం, చించలపు పద్దు, లింగ నాయుడు, పిఎసిఎస్ చైర్ పర్సన్ లు కొప్పిశెట్టి బుజ్జి, దార్ల కృష్ణ పాల్గొన్నారు.



యూనిట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో తంగేడు గ్రామంలో విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌ను విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ బృందం తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ చేపడుతున్న విత్తనాల అభివృద్ధి వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు రికార్డులను పరిశీలించారు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. ఇక్కడ వృద్ధి చెందుతున్న విత్తనాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి సింహాచలం, జిల్లా వ్యవసాయ శాఖ క్వాలిటీ ఇన్స్పెక్టర్ సరోజిని, పాయకరావుపేట సహాయ సంచాలకులు ఉమా ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి సరోజిని పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు

మోదకొండమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో కేజే పురం మోదకొండమ్మ జాతర మహోత్సవం ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ రాపేటి జోగినాయుడు, సభ్యులు తెలిపారు.ఈ మేరకు మంగళవారం శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి చేతులు మీదగా జాతర మహోత్సవ పోస్టర్లు కేజేపురం జంక్షన్ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి జాతరకి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జామి రమణబాబు, వైస్ చైర్మన్ రాపేటి రాజశేఖర్ నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, గాదిరాయి సర్పంచ్ పెంటకోట జగన్నాథం, పుట్ట రాంబాబు పాలకుర్తి శ్రీనివాస్, ఆడారి బాబ్జి, కాళ్ల నరసింహరాజు, సాలాపు వీరు నాయుడు, ఆడారి సన్యాసిరావు, తనకాల శివ దాడి రాము లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీడీ

3,316 మందికి స్పౌజ్ పింఛన్లు

ప్రజాశక్తి -కోటవురట్ల: అర్హత కలిగిన వారందరికీ స్పౌజ్ పింఛన్లు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు డిఆర్డిఏ పిడి సచీదేవి తెలిపారు. మంగళవారం మాకవరపాలెం మండలంలో ఆమె వెలుగు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రూపు సభ్యులకు రుణాలు మాత్రమే కాకుండా వ్యక్తిగత ఆదాయం పొందే విధంగా వివిధ ప్రాజెక్టులపై గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా వారికి సబ్సిడీపై ప్రభుత్వం అందజేసే పరికరాలను, రుణాలను అందజేయాలన్నారు, అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంతవరకు స్పౌజ్ పెన్షన్స్ అర్హత కలిగిన వారిని 3316 మందిని గుర్తించామన్నారు. అర్హత కలిగిన వారందరికీ పింఛన్లు అందే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మంగ తదితరులు పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న డిఎం అండ్ హెచ్ఓ

పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎంఅండ్‌హెచ్ఓ


ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని చీడిగుమ్మల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ హైమావతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. రోజువారీ ఓపిపై ఆరా తీశారు. ఎన్‌సిడి సర్వే, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు ఆన్‌లైన్ వేగవంతం చేయాలని సూచించారు. డెలివరీలు ఆసుపత్రిలోనే జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి : సిపిఎం


రోలుగుంటలో నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి-రోలుగుంట: స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి పిలుపునిచ్చారు. మంగళవారం రోలుగుంట మండలం నాయుడుపాలెం, రోలుగుంట గ్రామాల్లో స్మార్ట్ మీటర్లతో కలిగే నష్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఉన్న మీటర్లను తొలగించి స్మార్ట్ మీటర్లు బిగించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు వాణిజ్య సంస్థల్లో వీటిని బిగించారని చెప్పారు. ప్రైవేటు వాణిజ్య సంస్థలు బిల్లులు కట్టుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నూతన స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ప్రజలు భరించలేని భారాలు మోయాల్సి వస్తుందన్నారు. ఈ మీటర్ల బిగించేందుకు ఎవరైనా వస్తే ప్రతిఘటించాలని చెప్పారు.

బుచ్చయ్యపేట : అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపును వ్యతిరేకించాలని పిలుపునిస్తూ మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్‌వి నాయుడు, పి సాంబశివరావు ధ్వర్యంలో కరపత్రాలను పంచుతూ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సిపిఎం మండల శాఖ సభ్యులు పొత్తూరు అప్పారావు, సీరా రాజబాబు, యేసు, చిలుక బాబు, లక్ష్మి నరసయ్య పాల్గొన్నారు.


బుచ్చయ్యపేటలో...

మునగపాక: ఉచిత విద్యుత్ పేరు చెప్పి, స్మార్ట్ మీటర్లు అమర్చటం ద్వారా రైతులను కూటమి ప్రభుత్వం దగా చేస్తోందని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆళ్ళ మహేశ్వరరావు ధ్వజమెత్తారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద బాధిత రైతులతో ధర్నా నిర్వహించారు. విద్యుత్తుపై ప్రైవేటీకరణ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, వ్యవసాయ రంగానికి విద్యుత్ భారాలను ఆపాలని, ఉచిత విద్యుత్తుకు నగదు బదిలీ వద్దని రైతులు నినాదాలు చేశారు. వేలల్లో వచ్చిన వ్యవసాయ విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. స్మార్ట్‌మీటర్లను రద్దుచేయాలని, బిగించిన వాటిని వెనక్కు తీసుకోవాలని కోరుతూ ఎఇఇ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ విద్యుత్ మీటర్లకు రూ. 20వేలు నుండి 22 వేల వరకు బిల్లులు వేయడం దుర్మార్గమన్నారు. వేలల్లో బిల్లులు వస్తుంటే ఉచిత విద్యుత్ ఎక్కడ అమలౌతున్నట్లు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పాల రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ బ్రహ్మాజీ, కౌలు రైతు సంఘం నాయకులు కె.రాము,వెంకటాపురం మాజీ ఉపసర్పంచ్ గని శెట్టి సత్యనారాయణ, ఎస్ మురళీకృష్ణ, కె.కృష్ణ గోవిందరావు, డి మాలక్షిరావ్, చిన్ని గోవిందా, జి నూకరాజు పాల్గొన్నారు.

ఉక్కునగరం : ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించొద్దని జివిఎంసి 64వ వార్డు పరిధి గంగవరం గ్రామంలో మహిళలు ఎవరింటికి వారే పోస్టర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో 64 వార్డు సిపిఎం నాయకులు యు.సోమేష్, వై.అప్పలరాజు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకోవాలని జివిఎంసి 86 వార్డు పరిధి కూర్మన్నపాలెం దువ్వాడ బ్రిడ్జి వద్ద జరిగిన సంతలో సిపిఎం స్టీల్ జోన్ కమిటీ కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, నాయకులు యు.రామస్వామి, ఎన్.దత్తాత్రేయరాజు, కె గంగాధర్, నారపరెడ్డి, డిఎస్ఆర్‌సి.మూర్తి, పి.గోపాలకృష్ణంరాజు, అప్పారావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 28వ వార్డు పరిధి సంతోషిమాత కాలనీ, నెహ్రూ నగర్‌లలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. సిపిఎం నాయకులు కె.నర్సింగరావు ఆధ్వర్యంలో గోడలపై స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడారు. జగదాంబ జోన్ కళాకారుడు దానయ్య, సిఐటియు జోన్ ప్రధాన కార్యదర్శి కర్రి చంద్రశేఖర్, ఆర్.గోవిందరావు, ఎం.సుబ్బారావు, వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు కనకరాజు పాల్గొన్నారు.



దువ్వాడలో...

ప్రపంచ బ్యాంకు బృందం పర్యటన

-చెరువుల అభివృద్ధిపై తనిఖీలు

ప్రజాశక్తి-కోటవురట్ల: ఆంధ్రప్రదేశ్ సమీకృత నీటిపారుదల, వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు వంటి అభివృద్ధి పనులను ప్రపంచ బ్యాంకు బృందం మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా సుంకపూరు గ్రామంలో 97 లక్షలతో చేపట్టిన చెరువు పనులను తనిఖీ చేశారు. చౌక్ అమడవ్ ట్రిడియన్ డెమో (సీనియర్ అగ్రికల్చర్ స్పెషలిస్ట్ సౌత్ ఆఫ్రికా) ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టిన పనులు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. 2017-18 మంజూరైన నిధులు నేటికీ ఖర్చు కాకపోవడం, 97 లక్షల కు గాను 22 లక్షల మాత్రమే ఖర్చు చేయడంతో చెరువు అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచి పోయాయన్నారు. 2019 కరోనా కారణంగా పనులు నిలిచిపోయాయని ప్రస్తుతం నాటి రేట్లతో పనులు మొదలు సాధ్యం కానట్లు ప్రపంచ బృందానికి అధికారులు తెలిపారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బృందం సభ్యులు మాట్లాడుతూ, నాటి ఉమ్మడి జిల్లాలో 146 ట్యాంకులను గుర్తించగా 98 ట్యాంకుల పనులకు నిధులు మంజూరు చేశామన్నారు. 21 పనులను పూర్తి చేసినట్లు వెల్లడించారు ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు ఆర్.రాజేశ్వరరావు, రాజేంద్రకుమార్, జనార్ధన్, సూర్యకుమారి, రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారిని సరోజిని, మండల జనసేన నాయకులు చిటికెల శ్రీనివాస్, టిడిపి నాయకులు భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు.


పర్యటిస్తున్న బృందం సభ్యులు

వాడీవేడిగా మండల సమావేశం

సమస్యలపై ప్రశ్నించిన సభ్యులు


ఘర్షణ పడుతున్న టిడిపి, వైసిపి సభ్యులు

ప్రజాశక్తి- మాడుగుల: సమస్యలు పరిష్కార దిశగానే అధికారులు చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఎంపీపీ రాజారాం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు హాజరయ్యారు. ముందుగా వ్యవసాయ అధికారిని వ్యవసాయ రంగంపై మాట్లాడుతుండగా కొంతమంది సభ్యులు విత్తనాలు నాణ్యత లోపించిందని, మొలకశాతం తక్కువగా ఉందని ప్రశ్నించారు. ఎంజిఎన్‌ఆర్‌జిఎస్ పనులు విషయమై ప్రస్తావిస్తున్న సమయంలో సభ్యులు కొన్ని అభ్యంతరాలను వ్యక్తపరిచారు. దీనికి సంబంధించి ఏపీవో వివరణ ఇచ్చారు. ఆర్డబ్ల్యూఎస్,విద్యుత్ శాఖ, రెవిన్యూ, ఐసిడిఎస్, వెలుగు, ఆర్ అండ్ బి , విద్య శాఖలకు చెందిన అధికారులు మాట్లాడిన సందర్భంలో సర్పంచులు, ఎంపీటీసీలు ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించే విధంగా అవగాహన సదస్సులు ఏర్పాటు, విత్తనాలు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా డయేరియా కేసులు రాకుండా చర్యలు తీసుకోవాలని వైద్యులకు ఆదేశించారు. వసతి గృహ విద్యార్థులకు దోమతెరలు అందించే విధంగా అధికారులతో మాట్లాడుతామన్నారు. జాబ్ కార్డ్ కలిగిన ప్రతి ఉపాధి కూలికి పనులు కల్పించాలని ఏపీఓ కి ఆదేశించారు. ఆర్అండ్‌బి పరిధిలో ఆక్రమణలకు గురైన వాటిని రెవిన్యూ, పంచాయితీ, పోలీస్ అధికారులతో కలిసి వాటిని తొలగించాలని ఆదేశించారు. అనంతరం పిఎసిఎస్ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన వారికి ఘనంగా సన్మానించారు.

మహిళా మార్ట్‌పై గందరగోళం

వెలుగు ఏపిఎం రమణి కుమారి డ్వాక్రా సంఘాల గురించి మాట్లాడుతున్న తరుణంలో మహిళ మార్ట్ లాభాల్లో నడుస్తుందా నష్టాల్లో ఉందా దానికి సంబంధించిన వివరాలు చెప్పాలని మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ అడిగారు. దానికి సంబంధించి విషయాలను ఏపిఎం ప్రస్తావిస్తుండగా కింతలి పిఎసిఎస్ అధ్యక్షుడు ఉండూరు దేవుడు మాట్లాడుతూ, మహిళ మార్ట్‌లో ఉద్యోగులను ఎవరు నియమించారని, జీతాలు ఎవరు నిర్ణయించారని, ఏడాదికి ఒకసారి ఆడిట్ జరిగిందా అని ప్రశ్నించడంతో ఒక్కసారిగా సమావేశంలో గందరగోళం వాతావరణం నెలకొంది. దీంతో వైసిపి టిడిపి వర్గీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఎమ్మెల్యే బండారు కలుగజేసుకొని మహిళ మార్ట్కు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన నివేదిక తనకు 15 రోజుల్లో అప్పగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి జ. అప్పారావు, జడ్పిటిసి కిముడు రమణమ్మ, డిప్యూటీ తహసిల్దార్ రాజా, ఏనో జీవీఎస్ గోపాలరావు, పెద్దేరు రిజర్వాయర్ . చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, సర్పంచ్ కళావతి పాల్గొన్నారు.